
# సాక్షి
## అన్నమయ్య జిల్లా
బుధవారం । 16 । అక్టోబర్ । 2024



**వెలిగల్లులో పెరిగిన నీటిమట్టం**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెలిగల్లు జలాశయానికి వరద నీరు చేరడంతో నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం 2.348 టీఎంసీలకు నీరు చేరింది. - 10లో



**నిబంధనలు గాలికి.. బాధ్యతలు చేతికి**

కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. తమకు నచ్చిన వారితో సమగ్ర శిక్షలోని ఖాళీ పోస్టులు భర్తీ చేసిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి - 10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.550 | రూ.640 |
| రెండోరకం | రూ.410 | రూ.540 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 119 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### నేడు పాఠశాలలకు సెలవు

రాయచోటి (జగదాంబసెంటర్) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలు, జూనియర్ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరిక మేరకు.. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ పాటించాలని ఆదేశించారు.

### విధి నిర్వహణలో సమయం పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

సిద్దవటం : పశు సంవర్ధక శాఖలో ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో సమయం పాటించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య తెలిపారు. సిద్దవటంలోని పశు వైద్యశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లోని పాడి పశువుల రైతులకు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 16 నుంచి 31 వరకు జరిగే నట్టల నివారణ కార్యక్రమంలో పాల్గొని నట్టల నివారణపై రైతులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం పశు వైద్యశాల అసిస్టెంటు డైరెక్టర్ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

### 23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేది ఉదయం 10 గంటలకు స్థానిక జెడ్పీలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నారని సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీలు, అధికారులు ఖచ్చితంగా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు. జిల్లా అధికారులు తమ శాఖల పరిధిలో ప్రగతి నివేదికలను తీసుకు రావాలని సూచించారు.

### జెడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకరణ



సి.ఓబులమ్మ

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సి.ఓబులమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాలో డీఎల్‌డీఓగా పనిచేసిన ఆమెను రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. ఇప్పటిదాక సీఈఓగా ఉన్న సుధాకర్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. సీఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ మైథిలి, ఇతర జెడ్పీ సిబ్బంది కొత్త సీఈఓ ఓబులమ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

### 'రాయలసీమ' రిజిస్ట్రార్‌గా వైవీయూ అధ్యాపకుడు

వైవీయూ : యోగివేమన యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ సహ ఆచార్యులు డాక్టర్ బోయ విజయ కుమార్ నాయుడు కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఈయన విశ్వవిద్యాలయంలో శాఖ అధిపతిగా , బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ సమన్వయకర్తగా, ట్రాన్స్‌పోర్ట్ విభాగ సమన్వయకర్తగా, వైవీయూ ప్రవేశాల సహాయ సంచాలకులుగా, న్యాక్ కోర్ కమిటీ మెంబర్‌గా పనిచేశారు. డాక్టర్ విజయ కుమార్ నాయుడును వీసీ కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పి. పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

### ఇన్‌చార్జి మంత్రుల నియామకం

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. వైఎస్సార్ జిల్లాకు బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవితను నియమించారు. శ్రీ సత్యసాయిజిల్లా పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె టీడీపీ అభ్యర్థిగా తొలిసారి శాసనసభకు ఎన్నికయ్యారు. ఇక అన్నమయ్య జిల్లాకు రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన నంద్యాలజిల్లా బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ ఎంఎస్ నెంబరు 3ను జారీ చేసింది.

## ప్రైవేటు ట్రావెల్స్‌కు
# దసరా బోనస్!

- నిలువు దోపిడీ చేస్తున్న యాజమాన్యాలు
- మండిపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు



సాక్షి రాయచోటి : దసరా పండుగ ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలకు బోనస్‌గా మారింది. సాధారణంగా కింది స్థాయి వారు తమ ఉన్నతాధికారులను దసరా మామూలు అడిగి తీసుకుంటూ ఉంటారు. అయితే ఇక్కడ మాత్రం యథేచ్ఛగా ప్రయాణికుల నుంచి రాబడుతున్నారు. అంతో, ఇంతో అయితే ఫర్వాలేదు గానీ.. రెట్టింపు చార్జీలు వసూలు చేస్తుండటం ఆందోళన కలిగించే పరిణామం. ప్రయాణికుల అవసరాలను డిమాండ్‌గా చేసుకుని సాధ్యమైనంత వరకు.. దోచేస్తుండడంపై పలువురు మండిపడుతున్నారు. ఆర్టీసీ ప్రత్యేకంగా సర్వీసులు నడిపినప్పటికీ.. ప్రయాణికుల అవసరాల మేరకు సరిపోలేదు. ఈ నేపథ్యంలో కొందరు ప్రత్యేక వాహనాలు బాడుగలకు తీసుకుని వెళ్లడం, మరికొందరు రైళ్లు, విమానాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. అయితే ఎక్కడా కూడా రిజర్వేషన్లు లభించకపోవడంతో సెలవులు ముగియగానే.. ఆయా ప్రాంతాలకు వెళుతున్న వారికి ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు దోపిడీకి తెరతీశాయి.

**రైళ్లు, ఆర్టీసీలో రిజర్వేషన్‌లు అయిపోవడంతో..**

అన్నమయ్య జిల్లా నుంచి వివిధ పనుల నిమిత్తం వ్యాపారులు, విద్యార్థులు, వివిధ రంగాల్లో స్థిరపడిన వారు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఇలా చెప్పుకుంటూపోతే 15–20 వేల మంది వరకు.. వివిధ నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్నారు. ప్రధానంగా బెంగళూరు, విజయవాడ, హైదరాబాదు, చెన్నై, విశాఖపట్టణం, తిరుపతి తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున జిల్లా వాసులు ఉన్నారు. విజయదశమి పండుగకు ఎక్కువ సెలవులు రావడంతో వారు సొంతూర్లకు వచ్చారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి రిజర్వేషన్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే పండుగ సెలవుల నేపథ్యంలో రెండు నెలలకు ముందుగానే రిజర్వేషన్లు అయిపోయాయి. దీంతో బస్సులు, రైళ్లలో ప్రస్తుతం టిక్కెట్లు లభించే పరిస్థితి లేదు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కడ అవకాశముంటే అక్కడ బయలుదేరి వెళ్లిపోతున్నారు.

**భారీగా చార్జీ వసూలు**

జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె, రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల నుంచి పండుగకు వచ్చిన ప్రజలు తమ గమ్య స్థానాలకు పయనమయ్యారు. ఈ క్రమంలో ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాల భారీ దోపిడీ కొనసాగుతోంది. కొన్ని బస్సుల్లో సీట్ల మధ్యలో కూడా కుర్చీలు వేసి అదనపు సీటుగా మార్చి ప్రయాణికులను కూర్చోబెడుతున్నారు. రాయచోటి నుంచి విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సులో రూ.800 లోపు చార్జీ ఉండగా, స్లీపర్‌లో రూ.1500, ఏసీలో రూ. 2000కు పైగా తీసుకుంటున్నారు. అలాగే హైదరాబాదు, చెన్నై, బెంగళూరు బస్సుల్లో కూడా ఇలాంటి పరిస్థితే కొనసాగుతోంది. అయితే రవాణా శాఖ అధికారులు గానీ, ఇతర సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం లేదు. ఏది ఏమైనా దసరా పండుగ మాత్రం ప్రైవేటు ట్రావెల్స్‌కు దోపిడీ రూపంలో దసరా బోనస్ అందుతోంది.

## తిరుగులేని శక్తిగా వైఎస్‌ఆర్‌సీపీ బలోపేతం

రాయచోటి : పార్టీ శ్రేణులకు తోడుగా నిలిచి వైఎస్ఆర్ కాంగ్రెస్‌ను జిల్లాలో తిరుగులేని శక్తిగా తయారు చేయడమే లక్ష్యమని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటిలోని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లాలోని పార్టీ నియోజకవర్గ స్థాయి సమన్వయకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కమిటీల ఏర్పాటు, అనుబంధ సంఘాల కమిటీల నియామకాలను కూడా నియోజకవర్గాల ఇన్‌చార్జిల సూచనలు, జిల్లా సీనియర్ నాయకుల సలహాలతో త్వరలోనే పూర్తి చేయాలన్నారు. ప్రతి 15 రోజులకొకసారి నియోజకవర్గ పరిధిలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, రెడ్డప్పగారి రమేష్ కుమార్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్‌లు పలు అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు

**అబ్దుల్ కలాంకు ఘన నివాళి**

రాయచోటిలోని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో అబ్దుల్‌కలాం 93వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మందస్తు చర్యలపై అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సూచించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో తగిన ప్రణాళికలతో ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేసుకోవాలని అధికారులకు సూచనలు చేశామన్నారు. ఈ నెల 14న జిల్లాలో 28 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందన్నారు. మంగళవారం తక్కువగానే వర్షం పడిందన్నారు. అయితే 16న అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో తగిన ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల, డివిజన్ స్థాయి అధికారులు వారి పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కూడా ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పాడి రైతులు అనుబంధ శాఖల అధికారుల సూచనలు, ముందస్తు హెచ్చరికలను పాటిస్తూ ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా జిల్లా యంత్రాంగంతో సహకరించాలని తెలిపారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, కల్వర్టులు, బ్రిడ్జీలు, రహదారులు ముందుగానే పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామన్నారు. జిల్లాలో ముఖ్యంగా రాజంపేట డివిజన్ ఎక్కువ ప్రభావితం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాగే మదనపల్లిలో నాలుగు కాలనీలు కూడా ప్రభావితం అయ్యే అవకాశం ఉన్నందున అక్కడ ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించామని చెప్పారు. జిల్లాలో చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులను కూడా నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

## సహాయక చర్యలకు పటిష్ట ఏర్పాట్లు

**సబ్ కలెక్టర్ మేఘస్వరూప్**



మదనపల్లె : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయక చర్యల కోసం పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. మంగళవారం సాయంత్రం సబ్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లె రెవెన్యూ సబ్ డివిజన్‌లో 15వతేదీ సాయంత్రం 4 గంటల వరకు 222.2 సెం.మీ.ల వర్షపాతం కురిసిందని, అత్యధికంగా కురబలకోటలో 27.6 మి.మీ.ల వర్షపాతం నమోదైందన్నారు. అల్పపీడనం ప్రభావంతో సబ్ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందన్నారు. బి.కొత్తకోట 19.2 మి.మీ., కలికిరి 20.2మి.మీ, కురబలకోట 27.6, మదనపల్లె 22.6, ములకలచెరువు 22.4, నిమ్మనపల్లె 15.2, పెద్దమండ్యం 24.4, పీటీఎం 16.0, రామసముద్రం12.2, తంబళ్లపల్లె 20.6, వాల్మీకిపురం 21.8 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. వరుసగా రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో 18వ తేదీ వరకు ప్రజలు బయట అనవసరంగా తిరగవద్దని కోరారు. రోడ్లు, కల్వర్టులపై నీటి ప్రవాహం అధికమైతే క్రాస్ చేయవద్దన్నారు. సబ్ కలెక్టరేట్‌లో తుపాను సహాయక చర్యల కోసం మూడు షిఫ్ట్‌ల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యల కోసం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు 9989176247, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకు 9490827676, రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు 6303308475 ఫోన్ నంబర్లకు కాల్ చేసి సమస్య తెలపాలన్నారు. వీటికి ఫోన్ చేస్తే తక్షణం స్పందించడంతోపాటు, అవసరమైతే పునరావాస కేంద్రాల తరలింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. భారీ వర్షాల కారణంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను అప్రమత్తం చేశామని, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అత్యవసర వైద్యసేవలకు సంబంధించి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీటి నాణ్యతను పరీక్షించి, కలుషిత నీరు కలవకుండా ట్యాంకులను శుభ్రపరిచేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించామన్నారు. మురుగునీటి కాలువలు, వంకల్లో నీరు సాఫీగా ప్రవహించేలా పూడికలు తీయించామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లో పని చేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద, స్తంభాల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని సూచించారు. ప్రజలు సరైన జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం లేకుండా బయటపడవచ్చని వివరించారు.

## పెన్నాలో..సుడిగండాలు

- తెలియని వారి పాలిట శాపాలు
- నదీ ప్రవాహం సుందరం.. దిగితే విషాదకరం
- సిద్దవటం తీరం వెంట రక్షణ గోడేది?
- స్థానికులు కోరుతున్నా పట్టించుకోని వైనం

నది : పెన్నా
వెళ్లేది : సోమశిల జలాశయం
ప్రాంతం : సిద్దవటం
మృతుల సంఖ్య : 53



పెన్నా నది హొయలు.. సోయగాలు చూడటానికి రెండు కళ్లు చాలవు అనే రీతిలో నీటి ప్రవాహం కనిపిస్తుంది. సిద్దవటం మీదుగా గుండ్లమాడ వద్ద అటు చెయ్యేరు, ఇటు పెన్నా కలిసి సోమశిల జలాశయంలోకి వెళ్తుంది. ఈ సుందర దృశ్యం తిలకించేందుకు చాలా మంది ఆసక్తి చూపుతుంటారు. అదే కొందరిని మృత్యుఒడిలోకి జారేలా చేస్తుంది. ఇలా దశాబ్దాలుగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుత భారీ వర్షాల నేపథ్యంలో అటు వైపు వెళ్లవద్దని అధికారులు సూచనలు చేస్తున్నారు.

రాజంపేట : పెన్నా నదీ ప్రవాహం రాజంపేట నియోజకవర్గంలోని చరిత్రాత్మక ప్రాంతమైన సిద్దవటంను అనుకొని కొనసాగుతుంది. ఈ ప్రవాహం వల్ల ఒకప్పుడు భాకరాపేట-సిద్దవటం మధ్య రాకపోకలు కూడా నిలిచిపోయే పరిస్థితులు ఉండేవి. అప్పుడు బద్వేలు-సిద్దవటం, మైదుకూరు- కడపకు చేరుకునే వారు. అయితే నదిని దాటే క్రమంలో అనేక మంది గల్లంతు కావడం జరిగింది. 2020-2024 వరకు 53 మంది పెన్నానది సుడిగుండాలతో మృత్యుగర్భంలోకి జారుకున్నారు.

**కొన్ని దశాబ్దాలుగా..**

పెన్నా నది పూర్తిగా సుడి గుండాలమయం. తెలియని వారు నీటి ప్రవాహంలోకి దిగితే మృత్యు ఒడిలోకి జారుకోవాల్సిందే. తీర ప్రాంతం వెంట నదిలో దిగడానికి అనేక మార్గాలు ఉన్నాయి. పర్యాటకులు, విహార యాత్రకు వచ్చే వారిని పెన్నా ఆకర్షిస్తుంది. అక్కడ ఆహ్లాదకర వాతావరణం చెప్పలేని అనుభూతిని ఇస్తుంది. అదే సుడిగుండాల రూపంలో కబళిస్తోంది. కొన్ని దశాబ్దాలుగా సుడిగుండాలు మనుషుల ప్రాణాలకు గండాలుగా మారుతున్నాయి. సిద్దవటం కోటతోపాటు అక్కడ పర్యాటక ప్రాంతాన్ని ఆస్వాదించేందుకు వచ్చే వారికి.. వారి కుటుంబాల్లో విషాదాన్ని మిగిలిస్తోంది.



పెన్నా నది నీటి ప్రవాహం (ఇన్‌సెట్) సుడి గుండంలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి మృతదేహాన్ని తీసుకొస్తున్న గజ ఈతగాళ్లు, పోలీసులు (ఫైల్)

**కొన్ని మృత్యు సంఘటనలు**

పెన్నా సుడి గుండాలతో 2020 నుంచి ఇప్పటి వరకు 53 మంది మృత్యు ఒడిలోకి చేరుకున్నారు. 2020 డిసెంబరు 17న తిరుపతికి చెందిన కొంత మంది స్నేహితులు సిద్దవటంలో పెన్నానది వద్దకు విహారయాత్రకు వచ్చారు. ఏడుగురు స్నేహితులు సుడిగుండాల్లో చిక్కి ప్రాణాలు విడిచారు. వారి కుటుంబాలను విషాదంలోకి నెట్టివేశారు. 2022 ఫిబ్రవరి 17న సిద్దవటం ఎగువపేటకు చెందిన ఇద్దరు చిన్నారులు బాలాజీ(7), సతీష్(10) నదిలో ఈతకు వెళ్లి సుడిగుండంలో పడ్డారు. అంతే మృత్యువాతకు గురయ్యారు. 2023 అక్టోబరు 16న నదిలో పడి గుర్తుతెలియని మహిళ ఒడ్డుకు కొట్టుకొచ్చింది. 2024 అక్టోబరు 9న కడప బీడీ కాలనీకి చెందిన జేమ్స్.. నదిని చూసేందుకు వచ్చి మృతి చెందారు. అంతేగాకుండా విధి నిర్వహణకు వెళ్లే సమయంలో వంతెన లేనప్పుడు నది దాటుతూ కొంత మంది ఉద్యోగులు ప్రాణాలు విడిచారు.

**దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో..**

బద్వేలు-కడప మార్గంలో భాకారపేట-సిద్దవటం మధ్య పెన్నానది ప్రవాహం వల్ల తుపాను ప్రభావంతో వరదలు సంభవించినప్పుడు రాకపోకలు నిలిచిపోవడం కొన్ని దశాబ్దాలుగా కొనసాగింది. లోలెవల్ వంతెన ఉండేది. నీటి ప్రవాహంలో ఈ వంతెన మునిగిపోయేది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పెన్నానదిపై హైలెవల్ వంతెన నిర్మితం చేశారు. నది ఉప్పొంగి ప్రవహించినా.. హైలెవల్ వంతెన వల్ల రాకపోకలు సులభతరం కావడంతో ఇప్పటికీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సిద్దవటం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

**తీరప్రాంతాలు విలవిల**

సిద్దవటం వద్ద ప్రవహించే పెన్నానది తీర ప్రాంతాలు వరద నీటి ఉధృతి కారణంగా విలవిలలాడుతున్నాయి. వెంకటాయపల్లె, బి.కొత్తపల్లె, పి.కొత్తపల్లె, జ్యోతి గొల్లపల్లె, జ్యోతి, వందాటిపల్లె, ఎస్ రాజంపేట, సిద్దవటం, కమ్మపాళెం, జంగాలపల్లె, వెలుగుపల్లె, యేటికి ఆవలివైపు లింగంపల్లె, కడపాయపల్లె, టక్కోలి, మాచుపల్లె, సంతిగారిపల్లె, మూలపల్లె గ్రామాలు ఉన్నాయి. ప్రధానంగా టక్కోలి, సిద్దవటం వంతెన వద్ద, మాచుపల్లె వద్ద పెన్నాలోకి స్థానికులు, స్థానికేతరులు దిగుతుంటారు. అలాగే రక్షణ గోడ లేకపోవడంతో పెన్నా వరదనీటితో రైతులు ఇబ్బందులు పడుతుంటారు. పంట పొలాలు నీటిమయమవుతున్నాయి. వీటన్నింటికీ పరిష్కారం రక్షణ గోడ అని స్థానికులు అంటున్నారు.

### ఎవరూ దిగకండి



పెన్నానదిలో సుడిగుండాలు అధికంగా ఉన్నాయి.. ఎవరు దిగకండి. వంతెన వద్ద ప్రమాదకర పరిస్థితులను వివరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాం. సిద్దవటంకు పర్యాటకులు, విహారయాత్రకు అనేక మంది వస్తుంటారు. వారు కూడా నదిలో దిగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. పోలీసులు అక్కడే అవగాహన కల్పిస్తున్నారు.

– కృష్ణమరాజు నాయక్, సీఐ, ఒంటిమిట్ట

### రక్షణగోడ నిర్మించాలి



పెన్నా నదీ తీరంలో రక్షణ గోడ నిర్మితం చేయాలి. ఆ దిశగా పాలకులు దృష్టి సారించాలి. నదీ తీరం వెంట ఉన్న పొలాలు నీటి ప్రవాహం వల్ల మునిగిపోతున్నాయి. నదిలో సుడి గుండాలు అధికంగా ఉన్నాయి. తెలియని వారు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి అడ్డుకట్ట చర్యలు చేపట్టాలి.

– సింగం కృష్ణారెడ్డి, టక్కోలు, సిద్దవటం

## క్లుప్తంగా

### నగదు గల్లంతుపై విచారణ


విచారణ చేస్తున్న ఏజీఎం ఉదయ్ కుమార్

**పెనగలూరు :** మండలంలోని కట్టావారిపల్లిలో డ్వాక్రా మహిళల నగదు గల్లంతుపై ఏజీఎం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్, డీపీఎం ఐబీ వేణుమాదవ్, ఏరియా కో–ఆర్డినేటర్ మల్లికార్జున మంగళవారం విచారణ చేపట్టారు. అప్పటి సీసీ దాస్ ఆధ్వర్యంలో దాదాపు రూ.15 లక్షల గోల్‌మాల్ జరిగిందని, ఆయన కరోనాతో మృతి చెందడంతో ఈ విషయంపై విచారణ చేపట్టామని అధికారులు పేర్కొన్నారు. డ్వాక్రా సంఘం సభ్యుల నగదు గల్లంతు విషయంలో కట్టావారిపల్లికి చెందిన మాజీ యానిమేటర్‌పై ఆరోపణలు వచ్చాయని, విచారించి నివేదిక అధికారులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

### నిధుల దుర్వినియోగంపై..


నిధుల దుర్వినియోగంపై ఆరాతీస్తున్న డీఎల్‌పీఓ

**వీరబల్లి :** మండలంలోని సానిపాయి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై తెదేపా వర్గీయులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీఓ మస్తాన్‌వలి మంగళవారం సచివాలయంలో విచారణ చేపట్టారు. గతంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన ఆరాతీశారు. పనులకు చేసిన ఖర్చుల రికార్డులను సర్పంచ్ నేత ఆంజనేయులు, కార్యదర్శి సమక్షంలో పరిశీలించారు. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక క్వారీ పరిశీలన


ఇసుక క్వారీని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

**పెనగలూరు :** మండలంలోని నారాయణ నెల్లూరు, కోమంతరాజుపురం గ్రామాల్లో చెయ్యేరు నది వద్ద ఇసుక క్వారీలను సబ్ కలెక్టర్ వైభోమ్ నదియాదేవి మంగళవారం పరిశీలించారు. క్వారీ వద్ద విద్యుత్తు సరఫరా ఉందా? సెల్ ఫోన్ టవర్ పనిచేస్తోందా? క్వారీ వద్దకు దారి ఎలా ఉంది? తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఒకేసారి పెనగలూరు మండలానికి రెండు క్వారీలు మంజూరు చేసిన దాఖలాలు లేవని ఆమె తెలిపారు. అంతకుముందు సింగనమల చెరువు ఆమె పరిశీలించి చెరువులో నీరు ఎందుకు లేదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్.ఇంద్రాణి , ఏఈ దయానంద్, ఆర్ఐ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### ఇంటిలోకి దూసుకెళ్లిన లారీ

**ముద్దనూరు :** జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు ప్రయాణిస్తున్న ఓ లారీ.. ఆర్టీపీపీ రహదారి వద్దకు రాగానే అదుపుతప్పింది. గేట్ సమీపంలో నిలిపిన ఓ కారు, ఆటో, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని ప్రక్కనే వున్న ఇంటి ఆవరణంలోకి దూసుకెళ్లింది. అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది.

# నిబంధనలు గాలికి.. బాధ్యతలు చేతికి

అధికారం మాదే.. ఏమి చేసినా చెల్లుతుందనే ధోరణిలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. నిబంధనలను గాలికొదిలేసి తమకు నచ్చిన వారితో సమగ్ర శిక్షలోని ఖాళీ పోస్టులు భర్తీ చేశారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వంట మనుషుల నుంచి వాచ్‌మెన్ వరకు తొలగించి వాళ్ల సహచరులను నియమించుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

- నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఇద్దరి నియామకం
- గుట్టుచప్పుడు కాకుండా బాధ్యతల స్వీకరణ
- సమగ్ర శిక్షలో మరో రెండు కీలక పోస్టులు ఖాళీ


కడపలోని సమగ్రశిక్ష కార్యాలయం

**కడప టాస్క్‌ఫోర్స్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో అత్యంత కీలకమైన సమగ్ర శిక్ష పలు ఆరోపణలు ఎదుర్కొంటోంది. నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఇటీవల కడప సమగ్ర శిక్ష కార్యాలయంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ), అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్(ఏపీవో) పోస్టులు భర్తీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఖాళీ పోస్టుల భర్తీకి రాష్ట్ర సమగ్ర ప్రాజెక్టు అధికారులు నోటిఫికేషన్ ఇస్తే.. నిబంధనలు, అర్హతల మేరకు జిల్లా విద్యాశాఖ మాత్రమే ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రధాన పోస్టులకు ఎంఈఓ, హెచ్‌ఎం స్థాయి అధికారులను నియమించాల్సి ఉంది. కలెక్టర్, ఏపీసీ, డీఈఓ, డైట్ ప్రిన్సిపల్‌తో కూడిన కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించి అన్ని విద్యార్హతలు, టెక్నికల్ నాలెడ్జ్ పరిశీలించి.. ఆ పోస్టులు భర్తీ చేస్తారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ విద్యార్హతలేవీ లేకుండా కేవలం స్కూల్ అసిస్టెంట్ స్థాయి వారిని నియమిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అందులోనూ ఆ పోస్టుల భర్తీకి సంబంధించి సబ్జెక్టుల్లో నిష్ణాతులైన వారినే మాత్రమే ఎంపికచేయాల్సి ఉంది.

**వారి విధులు ఇలా..**

ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ పరంగా ఏఎంఓ కార్యక్రమాలను పర్యవేక్షించాలి. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించడం, వారికి శిక్షణ ఇవ్వడం చేయాలి. స్కూల్ అసిస్టెంట్ స్థాయి వ్యక్తిని నియమిస్తే ఆయన ఏ విధంగా పర్యవేక్షిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసిస్టెంట్ పోగ్రాం ఆఫీసర్ (ఏపీఓ) కూడా సమావేశాలు నిర్వహించి పాఠశాలల సమచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, నాడు– నేడు పనులను అప్‌డేట్ చేయడం, బిల్లులు చెల్లించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈ పోస్టుకు ఓ లాంగ్వేజ్ టీచర్‌ను ఎంపిక చేశారనే విమర్శలు వినవస్తున్నాయి. ఆమె అన్నమయ్య జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు కావడంతో ఎలా పర్యవేక్షిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**కీలక పోస్టుల భర్తీ ఎప్పుడో?**

సమగ్ర శిక్ష కీలకమైన పోస్టు జిల్లా ప్రాజెక్టు అధికారి. గతంలో ఈ స్థానంలో పనిచేసిన జిల్లా అధికారి ఫారెస్ సర్వీస్ గడువు ముగియడంతో తన మాతృ సంస్థకు రీపాట్రేషన్‌పై వెళ్లిపోయారు. గత ఎనిమిది నెలలుగా అ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సమగ్ర శిక్షలో జరగాల్సిన కార్యక్రమాలు సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలున్నాయి. మరో కీలక పోస్టు అకౌంట్ ఆఫీసర్. గత మూడు నెలలుగా ఖాళీగా ఉంది. ఉద్యోగులకు జీత భత్యాలు, అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులను అప్‌లోడ్ చేయడం వంటి పనులు నిర్వహించాల్సి ఉంది. ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సమగ్రశిక్ష కార్యాలయంలో అన్ని పోస్టులకు అర్హులనే నియమించాలని సిబ్బంది కోరుతున్నారు.

### వేధింపులపై కేసు నమోదు

**మదనపల్లె :** మద్యానికి బానిసై తనను వేధిస్తున్న భర్తపై ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ రామచంద్ర వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన సానియా(24) ఉపాధి నిమిత్తం బెంగళూరుకు వెళ్లింది. ఏడేళ్ల కిందట తనకు పరిచయమైన రవీంద్రను ప్రేమించి వివాహం చేసుకుంది. వీరికి ప్రత్యూష షైని అనే కుమార్తె ఉంది. గత రెండేళ్లుగా రవీంద్ర మద్యానికి బానిసై తన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ సానియాను వేధిస్తున్నారు. దీంతో ఆమె ఇటీవల పుట్టింటికి వచ్చేసింది. అదనపు కట్నం కోసం ఇటీవల మరింతగా వేధించడంతో మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### వ్యక్తిపై దాడి

**మదనపల్లె :** పట్టణంలోని వీవర్స్ కాలనీ గంగోత్రి ఫంక్షన్ హాల్ యజమాని గంగాధర్‌పై సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప రాడ్‌తో దాడి చేశారు. అతడికి చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని కాల్చేశారు. తనపై దాదాపు ఎనిమిది మంది దాడిచేసి, వాహనానికి నిప్పుపెట్టారని బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆంజనేయస్వామి ఆలయం.. ధ్వంసం

**ములకలచెరువు :** మండల కేంద్రంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయాన్ని గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. ఈ స్థలంలో పురాతన ఆలయం ఉండేది. గతంలో దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ములకల చెరువుకు చెందిన విద్యాసాగర్ అక్కడ నూతనంగా ఆలయాన్ని పునరుద్ధరించి పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మళ్లీ ఆలయాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దుండగులను వెంటనే పట్టుకుని శిక్షించాలని గ్రామస్థులు కోరారు.


ధ్వంసం చేసిన అభయాంజనేయస్వామి ఆలయం

## ఇసుక రీచ్‌తో ఇబ్బందులపై జేసీకి వినతి

**రాయచోటి(జగదాంబసెంటర్) :** వీరబల్లి మండలం మట్లి పంచాయతీలోని మాండవ్యానదిలో ఇసుక రీచ్‌తో తాము ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులతో కలిసి వెళ్లి జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ను మంగళవారం వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మాండవ్యా నది సమీపంలో వ్యవసాయ భూములున్నాయని, ఇసుక తోడడంతో భూగర్భ జలాలు తగ్గి ఆ భూములన్నీ బీడుగా మారుతాయని తెలిపారు. ఇసుక రీచ్‌తో చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్లలోనూ నీటి సామర్థ్యం తగ్గుతోందన్నారు. గతంలో ఇసుక రీచ్ రద్దు చేసి రైతులకు ఉపశమనం కలిగించారని, అయితే తాజాగా మళ్లీ అనుమతులు ఇవ్వడం తగదన్నారు.


జేసీ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

## కువైట్ నుంచి స్వగ్రామానికి మృత దేహం

**మృతుడి కుటుంబానికి ఎస్పీ సహకారం**

**రాయచోటి టౌన్ :** కువైట్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని అతడి కుటుంబీకులకు అప్ప జెప్పడంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు చొరవ చూపారు. పోలీసుల కథనం మేరకు.. సుండుపల్లె మండలం గుట్టమీద పల్లె ఎరుకల కాలనీకి చెందిన కంపా వీరాంజనేయులు జీవనోపాధి కోసం తన భార్య చెన్నకేశవలమ్మతో కలసి కువైట్‌కు వెళ్లారు. ఇద్దరూ ఒకే సేట్ వద్ద పనిచేస్తున్నారు. ఇటీవల కువైట్‌లో సేట్ పెద్ద కుమారుడితో కలిసి వీరాంజనేయులు బయటికి వెళ్లారు. ఎంతసేపైనా ఇంటికి రాక పోవడంతో అనుమానం వచ్చిన ఆమె ఇండియా ఎంబసీలో పని చేసే పెనగలూరు మండలానికి చెందిన జిలకర మురళికి ఫోన్ చేసింది. తన భర్త ఇంటికి రాలేదని తనకు అనుమానంగా ఉందని చెప్పింది. విషయం తెలుసుకున్న ఎంబసీ ఉద్యోగి విచారణ సాగించి ఆమె భర్త చనిపోయాడని, ఫార్మాహీ హాస్పిటల్‌లో మృతదేహం ఉందని చెప్పాడు. దీంతో ఆయన మృత దేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు అధికారుల సహకారం కోరడంతో మృతుడి కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఎస్పీ కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసి మృతదేహాన్ని స్వదేశానికి వచ్చే విధంగా కృషి చేశారు. ఇంటికి తీసుకొచ్చిన మృతదేహానికి మంగళవారం దహన సంస్కారాలు పూర్తిచేశారు. అన్నమయ్య జిల్లా పోలీస్ అధికారి(ఎస్పీ) విద్యాసాగర్ నాయుడు సహకారం మరువలేమని కువైట్‌లో మృతి చెందిన కంపా వీరాంజనేయులు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. వారు జిల్లా ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


మృతుడు కంపా వీరాంజనేయులు భార్య, కుమారులు

## వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

**కళాశాలలో ఫినాయిల్ తాగి..**

మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లెకు చెందిన ప్రమీల కుమార్తె శ్రీలత(19) పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం కళాశాలకు వచ్చిన శ్రీలత కొద్దిసేపటి తర్వాత బాత్ రూమ్‌లో ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన విద్యార్థినులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే..ఆత్మహత్యకు కారణాలను తెలిపేందుకు యువతి నిరాకరించింది.

**తండ్రి మందలించాడని..**

తన తండ్రి మందలించాడని మదనపల్లె మండలం చీకలబైలు పంచాయతీ దిగువమేడిపల్లెకు చెందిన ఇంటర్ విద్యార్థిని(17) మంగళవారం ఇంటి వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**భర్త పట్టించుకోవడం లేదని..**

భర్త తనను పట్టించుకోకుండా, ఇష్టానుసారంగా తిరుగుతున్నాడని పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన నరేష్ భార్య ప్రత్యూష(26) పురుగుమందు తాగి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. భర్త షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ మోజుతో కుటుంబాన్ని పట్టించుకోకుండా వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రత్యూష తెలిపారు. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**కుటుంబ సమస్యలతో భార్యాభర్తలు..**

కుటుంబ సమస్యలతో భార్యాభర్తలు ఇద్దరూ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన మంగళవారం గుర్రంకొండ మండలం నడిమికండ్రిగలో జరిగింది. స్థానికులైన భార్యాభర్తలు ఆర్.మనోహర్(38), ఆర్.నరసమ్మ(33) కుటుంబ సమస్యలతో మంగళవారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనల్లో సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.


కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు మనోహర్, నరసమ్మ

### తలనీలాల సేకరణకు వేలంపాట

**సిద్దవటం :** రాబోయే కార్తీక మాసంలో మండలంలోని లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్య పూజస్వామి ఆలయంలో భక్తుల తలనీలాల సేకరణకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయంలో నిర్వహించిన ఈ వేలంపాటలో మొత్తం ఐదుగురు పాల్గొనగా, చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన జి.రామక్రిష్ణ రూ.2.35 లక్షలకు పాడి దక్కించు కున్నారని ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, చంద్ర, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

**లక్కిరెడ్డిపల్లి :** ప్రమాదవశాత్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సతీష్‌కుమార్‌రాజు(36) మృతి చెందినట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ విష్ణువర్ధన్‌బాబు తెలిపారు. రాయచోటి జిల్లా వైకుంఠరాచపల్లికి చెందిన సతీస్ కుమార్ రాజు ఈ నెల 10వ తేదీన లక్కిరెడ్డిపల్లి పీఎస్‌లో విధులు ముగించుకొని రాయచోటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన తిరుపతికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళ వారం మృతిచెందినట్లు ఆయన తెలిపారు. సతీష్‌కుమార్‌రాజుకు భార్య, ఇద్దలు పిల్లలున్నారు. లక్కిరెడ్డిపల్లి సీఐ వెంకటకొండారెడ్డి, ఎస్ఐ విష్ణువర్దన్ బాబు, ఏఎస్ఐ మృతుడి కుటుంబీకులకు తమ సంతాపాన్ని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సతీష్ కుమార్ రాజు (ఫైల్)

### కారు ఢీకొని వ్యక్తి మృతి

**ములకలచెరువు :** కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన శ్రీనివాసులు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. మొలకలచెరువు మండలం నాయనవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో పెద్దపాళ్యం గ్రామానికి వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా.. మార్గమధ్యంలో వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు(45)ను 108 సాయంతో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. భార్య భువనేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీనివాసులును ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబసభ్యులు

## చోరీ కేసులో ముద్దాయికి ఏడాది జైలుశిక్ష

**మదనపల్లె :** పట్టణంలోని వన్, టూటౌన్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన నేరస్థుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ రెండో అడిషనల్ జిల్లా జడ్జి అబ్రహాం తీర్పునిచ్చినట్లు వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అప్పారావుతోటలో నివాసముంటున్న షేక్ మహమ్మద్ రఫీక్(48), తాళాలు వేసిన ఇళ్లకు వెళ్లి రాత్రి సమయంలో విలువైన వస్తువులు, నగలు, డబ్బు దోచుకెళ్లారు. ఈ క్రమంలో అతడిపై మదనపల్లె వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో నాలుగు, టూటౌన్ స్టేషన్ పరిధిలో రెండు, మొత్తం ఆరు కేసులు నమోదయ్యాయన్నారు. విచారణ జరిపి గతంలో ఒక్కో కేసులో రూ.2 వేల జరిమానా, ఏడాది జైలుశిక్ష విధించడం జరిగిందన్నారు. ముద్దాయి తనకు పడిన శిక్షపై రెండో అదనపు జిల్లా కోర్టుకు అప్పీల్‌కు వెళ్లాడన్నారు. విచారణ జరిపిన న్యాయమూర్తి అబ్రహాం ఏడాది సాధారణ జైలు శిక్షను ఖరారుచేస్తూ మంగళవారం తీర్పు వెలువరించిందన్నారు.


నిందితుడిని సబ్‌జైలుకు తీసుకెళుతున్న పోలీసులు



## పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**వేదామణెమ్మ సంతాప సభలో వైఎస్ విజయమ్మ తదితరుల నివాళి**

**పులివెందుల రూరల్ :** మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ తల్లి చవ్వా వేదామణెమ్మ సంతాప సభ సందర్భంగా పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల భవన్‌లో మంగళవారం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తొలుత వేదామణెమ్మ నివాసం వద్ద నిర్వహించిన సంతాప సభలో పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మతోపాటు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ సోదరులు వైఎస్ ఆనంద్‌రెడ్డి, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డిలతోపాటు వైఎస్ కుటుంబ సభ్యులు పాల్గొని ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులు, కుమారులు, కోడళ్లు, మనుమళ్లు, మనుమరాళ్లు పాల్గొన్నారు. కాగా, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నూర్‌బాష సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డిల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టారు. అనంతరం ఆమె ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.


పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

### నడిరోడ్డుపై ఆగిన అల్ట్రా డీలక్స్




రాయచోటి డిపోకు చెందిన అల్ట్రా డీలక్స్ బస్సు కలకడ వద్ద మూడు రోడ్ల కూడలిలో ఇలా నిలిచిపోయింది. ఉదయం తొమ్మిది గంటలకు మరమ్మతులకు గురై నడి రోడ్డుపై ఆగిన బస్సును బాగు చేసేందుకు మధ్యాహ్నం మూడు గంటల వరకూ మెకానిక్‌లు రాలేదు. గుర్రంకొండ–కలకడ వచ్చే బస్సులు రాక జనం అవస్థపడ్డారు. వర్షం కురుస్తున్నా.. ఎస్ఐ రామాంజనేయులు ఇద్దరు పోలీసులను నియమించి వాహనాలు రోడ్డుపై రాకుండా మళ్లించారు.

– కలకడ

### పంట నష్టం వివరాల నమోదు

**నందలూరు :** జిల్లాలో పంట నష్టం వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని పాటూరు, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో అధిక వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో నిలబడిన నీటిని రైతులు ప్రత్యేక కాల్వల ద్వారా బయటకు పంపాలన్నారు. క్రిందపడిన వరిని కట్టలుగా కట్టి ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. రైతులకు సమస్యలు ఉంటే ఆర్బీకేల్లో సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో మల్లికార్జున, షణ్ముఖ శ్రీనివాస్, పుష్పాంజలి, సాయి ప్రియ, శ్రీనివాసులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురు అరెస్టు

**తంబళ్లపల్లె :** గొర్రెను చోరీ చేసిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... మండలంలోని ఎద్దులవారికోటకు చెందిన రెడ్డమ్మ గొర్రెను కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా శ్రీనివాసపురం తాలుకా కె.కొత్తూరుకు చెందిన కొందరు చోరీ చేసి కారులో తీసుకెళుతుండగా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేశారు. గుండ్లపల్లె క్రాస్ వద్ద చోరీకి పాల్పడిన కె.పి.తిప్పన్న(44), ఆశ(21),పి.రాజేష్ (19)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్.ఐ తెలిపారు.

## వెలిగల్లు జలాశయంలో పెరిగిన నీటిమట్టం


వెలిగల్లు జలాశయం

**గాలివీడు :** రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెలిగల్లు జలాశయానికి వరద నీరు చేరడంతో నీటిమట్టం పెరిగింది. జలాశయం మొత్తం సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, మంగళ వారం నాటికి 2.348 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం 175 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతుండగా, 22 క్యూసెక్కుల నీటిని బయటికి విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉంటే గాలివీడులో 25.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.